


# మళ్లా వస్తే

“యెందుకు మా యింటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు? నేను వచ్చే రూట్‌లో బీట్ వేస్తున్నారెందుకు? నన్ను పట్టాక “అదే నా మీద పడిందని మీ వాళ్లతో చెప్పటానికా?” అని చుర చుర చూసింది.

“నేను అబద్ధమాడుతున్నానని మా వాళ్లు గ్రహించరూ?” దీర్ఘం తీశాడు.

“అట్టి గ్రహింపు వుండదు. తమ బంగారం మంచిదేనంటారు. వుత్తరం పడేస్తారు. ఇంటికి పరాయి మగాడు రాగానే బైరాగులల్లే మీద బడతారు అది మీ ఆచారం అని ప్రచారం చేస్తారు. “మావాడసలే అమాయకుడు. పిచ్చి సన్నాసి” అంటారు. మీకు డెఫ్‌నెస్సే కాక స్టోన్ బ్లైండ్ గూడా ఎటాక్ అయింది. దయచేసి మరో చేపను పట్టండి. గోల్డ్ ఫిష్‌ను పడితే యింకా మంచిది. సంసార సాగరంలో చాల చేపలున్నాయి. పెద్ద ఆశగానీ, దురాశగానీ, పేరాశగానీ లేదు నాకు. యేదో చిట్టి చదువూ, బుల్లి వుద్యోగం, నన్ను నేను సపోర్ట్ చేసుకోవాలనే ఆశయం అంతే. రంభలాగా కనబడుతున్నానేమో. అవసరం తీరగానే గొరిల్లాలాగ, కల్చర్ లేనట్టూ కనబడతాను. డబ్బుకోసం గడ్డి తినేదానిలాగా అర్థమౌతాను. మేల్కొండి. రంభను పట్టండి. మేనకతో అవసరం రాదు. పొండి. ఐస్పెషలిస్టుని కన్సల్టు చేయండి. కళ్లద్దాలేసుకోండి. నీలి కళ్లద్దాలైతే మరింత అట్రాక్టివ్‌గా వుండి మీ అంతరంగంలో యేమున్నదో యెదుటివారికి అంతుబట్టదు” అని బస్‌కోసం మరోవేపు చూసింది అమ్మాయి. ముహూర్తం బాగాలేదని అబ్బాయి వెళ్లిపోయాడు.

2

''మళ్లా వచ్చారే. మానియాయేమో. చాంచల్యం డాక్టర్ని కన్సల్టు చేయలేదు. పేరనాయిడ్ ఆడిస్తున్నదేమో. మొండితనం గొప్పవాడి లక్షణమని అయిడియాయేమో''. బస్‌స్టాప్‌లో నిలబడి తన బస్‌కోసం యెదురు చూస్తున్న ఫిమేల్ అన్నది. చేపతోక మీద నిలబడినట్టున్నది. పంజాబీ డ్రెస్సు. హాండ్‌బాగ్ భుజానికి వేలాడుతున్నది.

''యెందుకలా నొవ్వనాడుతావు? నీ కోసమే వచ్చి నిలబడ్డానని నమ్మకమేమిటి? నన్ను ఆకర్షిస్తున్నావనే యిగో తగ్గించుకో. బస్ షెల్టర్లో యింకా ఫిమేల్సు వెయిట్ చేయటం లేదంటున్నారా?'' ఫిమేల్నే చూస్తూ నిలబడిన మేల్ అన్నాడు.

''చూశారా నా సలహా పాటించలేదని తేలింది. గుడ్డి మొహం. ఇంకెవరున్నారిక్కడ యిప్పుడు? సరిగా కళ్లు తిప్పి పరిశీలించండి''.

మేల్ కళ్లు తలా తిప్పితే నిజంగానే పరులు లేరు. తామిద్దరే.

''సారీ'' అన్నాడు గానీ ఒక్కంగుళం గూడా కదల్లేదు. అందమైన కొత్త ఆటో వచ్చి ఆగింది. ''మీ గమ్యం వద్ద మిమ్మల్ని డ్రాప్ చేసిపోతా, పొద్దెక్కుతున్నది. శీతాకాలపు యెండ చిటచిటలాడిస్తున్నది'' అనటమేమిటీ చొరవగా ఫిమేల్ దండ పట్టుకు తీసికెళ్లి ఆటోలో వెనక సీటులో కూలేసి పక్కన తానూ కూలబడ్డాడు.

''పోనీ'' అన్నాడు. జేబులోని కొత్త పర్స్ తీసి ఇరవై నోటు అందించాడు. ఆటోవాలా వేళ్లు ఆ నోటును జేబులోకి నడిపించినాయి.

''యెక్కడికి సాబ్!'' పళ్లు చూపిస్తూ అడిగాడు.

''పోతూ వుండు. చెప్తాం'' అన్నాడు సాబ్. ''చెప్పు మిత్రమా యాడికి పోవాల?'' మోచేత్తో పొడుస్తూ అన్నాడు.

మొగలి పూరేకులాగా గుచ్చుకునేట్టు చూసింది. ''చెప్పాగా గమ్యం. యెమ్మీన్షియా. చిన్నజాబ్. యు ఆర్ యె మెంటల్లీ రిటార్డెడ్ పేషంట్. డోంట్ డేర్ టు బెండ్ మీ'' పట్టవలె రా మరుని కన్యక, కట్టవలెరా మరుని రాజ్యం. ''అదీ మీ స్లోగన్. నన్ను వంచించారంటే అనుభవిస్తారు సుమా. రావణుడు తపశ్శాలి అయిన ముని కన్యను పట్టబోతే, యిష్టం లేని స్త్రీని తాకావంటే తలపేలిపోతుంది. నేనే వచ్చి నీ లంక తగలబెడతా అని భయపెట్టిందట'' అని పేలుతున్నది పేలుడు పదార్థంలాగా. ''నాకు లంక లేదు. పదివేవురు స్త్రీలూ లేరు. నన్ను చెక్ చేసేందుకు మండోదరీ లేదు'' అని నవ్వుతున్నాడు.

ఆటో ఆగింది. ఆటోవాలా అడిగాడు.

''మంచి రెస్టారెంట్ వచ్చింది సాబ్. చానా లెక్క చక్కర్ కొట్టాము. మీరు గమనించలేదు, భోజనం వేళ. ఆకలేస్తున్నది. మీరు తిని నాక్కూడా పెట్టించరూ? మళ్లా బయలుదేరుదాం''.

ముందు మేల్ దిగాడు. లోపలున్న శాల్తీ దిగనన్నది. ''మీరిద్దరూ కానిచ్చి రండి''.

''నీ గమ్యం రాలేదేమో. అపు అనలేదే'' అని షివల్‌రస్‌గా దింపాడు. జేబీలోంచి యాభై నోటు తీసి ఆటోవాడికిచ్చాడు.

''నువ్వు పోయి నాన్ వెజిటేరియన్ రెస్టారెంటులో ఆరగించిరా'' అన్నాడు. ఆటోవాలా డెంక్చర్ చూపి బయ్‌మని ఆటో తోలుకెళ్లాడు.

''డబ్బున్న వాడిననీ, డబ్బంటే లెక్కలేదనీ, ప్రాక్టికల్సు చేసి చూపుతున్నారా? ప్రేమకు రెక్కలొచ్చి యెగిరిపోయి మిడిల్‌క్లాస్ వాడినని చూపుతారు. అదీ నిజమౌతుంది''.

''లంచ్ కానిస్తూ వాగ్యుద్ధం చేద్దాం. నేనింక నించోలేను'' అని మీద వాలి ఆనుకుని నడిపించాడు. బల్ల ముందుండగానే మెను ఫార్మల్‌గా క్విక్‌గా చూసి ఆర్డరిచ్చేశాడు.

''కానీ'' అని ఫిమేల్ వంకే చూస్తుండగా వేడివేడి ఘుమఘుమలాడే లంచ్ వచ్చిందెదురుగా. ఆవురావున తినసాగాడు.

''మిమ్మల్ని మీరు నిగ్రహించుకోవాలి. నిగ్రహం వుపకారం చేస్తుంది. ఉన్నాదాన్ని అరికట్టక సంఘ విరుద్ధంగా వుందామని వుద్రేకపడితే దుష్ఫలితాలు రాగానే మీ వంటివారు 'తప్పకుండా ఆడదాని నెత్తిన రుద్ది కాలర్ యెగరేసుకుంటూ, గూళ్లు తిప్పుకుంటూ, పెద్ద జాబ్ వెలిగించగలుగుతారు. బర్త్ కంట్రోల్ పద్ధతులు స్త్రీయే యెందుకు పాటించాలని ఓ గైనకాలజిస్టుని అడిగితే, పాటించకపోతే వచ్చే దుష్ఫలితాలు స్త్రీకే యెక్కువ ఆమె జాగర్తలో ఆమె వుండాలి'' అన్నది. పెళ్లాం బెల్లం తల్లి విషం అనే సామెత నిజం గాదు. మగవాడు తనవారినే ప్రేమిస్తాడు. స్త్రీ పరాయిదే'' స్లోగా చెప్తూ లంచ్ కానిస్తున్నది.

''నువ్వు గమ్యం చేరనే లేదు. ఇటువంటివెందుకు పట్టించుకున్నావు? నువ్వు వుదహరించే మేల్సుకి నేను ప్రతినిధిని గాను. అసలు మగవాడిని ద్వేషించటం

మెందుకలవాట్టైందీ? ముందు కడుపునిండా తిను. ఆత్మారాముడు చల్లబడతాడు. అంత హేట్రెడ్ మంచిది గాదు''. ''అప్పుడే డామినేషన్ మొదలైంది. జబర్దస్తీ చూపించేశారు. పరిచితులూ, చిరపరిచితులూ, బందుగులు, సాటిస్త్రీలు, అప్పుచెల్లెళ్లు చేసే కంప్లెయింట్స్ తలలో దూరుతాయి''.

మేల్ తలెత్తి స్వీట్‌కి ఆర్డరిస్తూ యెదురుగా సోఫా సీటులో వున్న పెద్దమనిషి ని చూచాడు. ఆయన ఆర్డరిచ్చి వెయిట్‌చేస్తున్నాడు. కళ్లతోనే పలకరించి నవ్వాడు.

లంచ్ స్వీటూ పూర్తి చేసి బిల్ చెల్లించి లేచారు. యెదుటి పెద్దమనిషి తన లంచ్ రాగానే బిగిన్ చేస్తూ అన్నాడు.

''వెళ్లిపోకండి. వాకిలి దగ్గర నా కోసం ఆగండి. మేటనీ వేళైంది చూసి పోదాం. మాదే థియేటర్. నేనూ మీ వల్లేనే వచ్చాను. స్త్రీ నింకా కట్టుకోకముందే లార్జ్ స్కేల్ మీద కలహించసాగింది. శాంతింప జేయాలని చూసిన కొద్దీ బిర్రబిగిసింది. వంటలేదివాళ. పొయిలో పిల్లి లేవలేదు. మరీ మంచిదనుకున్నా. ఫారిన్లో రోజూ వండుకు తినరు. అది ఫాషన్ గాదు. చిన్న విషయానికి గిల్లి కజ్జా పెట్టుకుని అట్లా వెళ్లి బయట మంచి భోజనం కానిస్తారు. దానిపేరు ''అవుట్'' అంటే ఇల్లు కంటే గుడిపదిలం అన్నమాట. సాగదీసి బయలు దేరదీశా లేడీలొను. సిగ్నల్స్ ఆగమంటే కారాపాను. ఆమెలాంటి స్త్రీ లిద్దరు వచ్చి తలుపు తీసి లాక్కెళ్లారు లేడీలొని. అదీ మా బాగే. పక్కన మునమునలాడేది లేదు'' అని నవ్వుతున్నాడు.

అమ్మాయి ఆయన్ని చూస్తు అన్నది ''అదేనండి బాబూ నేనూ తెలియజెప్తున్నా. పర్మనెంట్ అవ్వగాని రోమాన్సు గానీ లేదు. కల్ల.

నిగ్రహించుకోండి. గుడ్డి ప్రేమలో వుండగానే స్వార్ధం బైటబెడుతున్నారు. కంటికి మెరమెర, మసుకి పెరపెర వచ్చాయి. మేల్‌మైండ్ మెర్క్యురీ వంటిది. డిక్టేటరులాగా జీవించాలని కలగంటాడు. ఫిమేల్ని ఆరాధిస్తున్నట్టు జాలం విసురుతాడు, అని వివరిస్తుంటే చెవిటివాని ముందు శంఖు వూదుతున్నట్లున్నది వినికిడి యంత్రం వాడాలేమోయి మేల్. లేకపోతే రోకలి తలకు చుట్టమన్నవాడల్లే బిహేవ్ చేస్తాడా?'' అని నవ్వి అనుసరించింది.

ఆయన భోజనం చేస్తూ నే నవ్వుతూ అన్నాడు ''హియర్ హియర్. మీరు పొయెటెస్ అని నా అభిప్రాయం. దయచేసి వాకిలి వద్ద వెయిట్ చేయండి. యెంతా పదినిమిషాల్లో వచ్చేస్తా'' అన్నాడు.

3

వెండితెర మీద అక్షరాలు నాట్యమాడుతున్నాయి. సంసార మూవీస్. నిర్మాత మాయధారి. దర్శకుడు మోసకారి. స్వేచ్ఛా జీవి ఫిల్మ్స్ విడుదల. నటీనటులుః టోకరా, కొంగజపం, జంబుకేశ్వర వ్యాఘ్రేశ్వరి, పిడుగు. గెస్ట్ ఆర్టిస్ట్ పనిలేని బార్బర్.

కహో ప్యార్ నహీ హై.

చిత్రం మొదలైంది. యవ్వనం వచ్చిన హీరో తను కావాలన్నది లభించక ఫ్రస్ట్రేట్ అయి ఒక కొలను ఒడ్డున కూచుని మానసిక ఆరోగ్యం కోసం, చేపను పట్టాలని యెర కట్టిన గాలం నీళ్లలోకి దింపి వెయిట్ చేశాడు. మెల్లిగా పైకి తీస్తే చేప యెరనోట్లో యిరుక్కుని గాలంతో పైకి వచ్చింది. పొంగిపోయాడు కథానాయకుడు. చేపను గౌరవంగా పట్టుకుని నోట్లోని యెర తీశాడు. చేపను

చంపకుండా బుట్టలో వేశాడు. ఇంటికి తెచ్చి నీళ్ల తొట్టిలో వదిలాడు. ఆహారం వేశాడు. చేప పెద్దదై ఆకర్షవంతంగా అయింది. దాంతో జీవితం గడుపుతూ కుదురుగా వున్నాడు. ఆ ప్రాణి యెటూ పోయే అవకాశం లేదు. నీళ్లు మారుస్తాడు. అడుగున నేలలాగా కనబడేట్టు చేశాడు. చేప గుడ్లు పెట్టింది పిల్లలైనై. యెంతో ఆనందం తృప్తీ కలిగింది. వాటినీ తన యిష్టమెచ్చినట్టే పెరగనిచ్చి వేరే వేరే నీళ్ల తొట్లలో వదిలాడు. మొదట గాలానికి తగిలిన చేపగతిలో మార్పులేదు. కాని ఆ చేపలో అణిగివున్న సహజగుణం పైకిరాసాగింది. స్వేచ్ఛగా, తీయని నీటిలో లేదా నిర్మలమైన సరస్సులో, వీలుంటే విశాల సముద్రంలో యీదాలనిపించింది. సమయం కోసం చూస్తున్నది.

అదే చేపను చూసీ చూసీ మొహం మొత్తింది హీరోకి. తన వాళ్లు ''నీవు పట్టిన చేపను మన దొడ్లో బావిలో వదులుదాం తీసుకురా'' అని అడగటం గుర్తు వచ్చింది. ఆ ఆలోచన రావటమేమిటి, దానిని తమ వూరు తీసికెళ్లి తమ వాళ్లకిచ్చి బావిలో వేసుకోమందామని తీర్మానించాడు. కొత్తరకం నీళ్ల సంచీ తెచ్చి దానిలో వేసి మూతిబిగించి బయలుదేరాడు.

ప్రయాణంలో పరిచితులు, మిత్రులు కలిశారు. పలకరించి కబుర్లలోకి దింపారు. కూడా నడిచాడు. ఒక కాలవ ఒడ్డున కూచోబెట్టి తీయగా మాట్లాడుతూ తినటానికీ యిచ్చారు. హీరో సంచి ఒడ్డున బెట్టి, చేతులు కడుక్కుని తింటూ నవ్వుతూ కబుర్లాడుతున్నాడు.

సంచీలో ఆటే నీళ్లు లేవు. తాడు నానింది. చేప స్వేచ్ఛ కోసం బలంగా గెంతింది. దైవం అనుకూలించి తాడు వదులై మూతి వదులైంది. చేప కదిలి కదిలి కిందబడింది. దాపునే ప్రవహించే నీరు కంటబడింది. శక్తి కూడదీసుకుంటూ

కదిలి కదలి గెంతి గెంతి దొర్లి దొర్లి కాలవలోకి దూకింది చేప. నీళ్ల అడుగున యీదుతూ వెళ్లిపోయింది. స్నేహితులు, పరిచితులు వెళ్లిపోయారు. మైమరచి కబుర్లాడిన హీరోకి తెలివి వచ్చింది. సంచీ అందుకుని యింటికి చేరాడు.

''యెప్పటినించో అడుగుతున్నారని, ఆ చేపను తెచ్చుకున్న వేళావిశేషం వల్ల నీవు శ్రీమంతుడవైనావు. మాకూ శ్రీమంతులము కావాలని వున్నది. మనదొడ్లో బావిలో వేద్దాము'' అన్నారని తెచ్చానర్రా'' అని సంచీ యెత్తి చూపాడు.

అందరూ సంతోషించారు. బావి దగ్గరకెళ్లారు.

''మూతికి తాడు లేదే!'' అన్నారు ఆశ్చర్యపోయారు.

''తాడు లేకపోతేనేం. వదులైపడిపోయి వుండాలి. సంచీ మూతి చిన్నదే. చేప బాగా పెద్దదైంది గదూ. యెలా తప్పించుకుంటుంది?'' అంటూ సంచీ తలకిందులుగా పట్టుకుని బావిలోకి తిప్పాడు. నీళ్లు జలజలమని బావిలో పడినైగాని చేప పడలేదు. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

''తప్పించుకున్నది చేప'' హీరో లోపలే అనుకున్నాడు.

లైట్లు వెలిగినై ప్రేక్షకులు లేచి హాలు వదిలారు.

ఇద్దరు సుందరాంగులొచ్చి హీరోను చెరోవేపు పట్టుకున్నారు. పక్కన సీటు ఖాళీ. ఆ పక్క సీటులో వున్నాయన, సినిమాకు తెచ్చినాయన నవ్వుతున్నాడు.

''యేదీ?'' అనడిగాడు.

''అమ్మాయా? ఇంటర్వల్లో బైటికెళ్లింది. మీరూ చూశారు. మళ్లా తిరిగి

వచ్చి తన సీటు ఆక్రమించినట్టులేదు. మీరు అప్పుడే గమనించారనుకున్నా. తర్వాత వస్తుందేమోనని గూడా అనుకున్నా'' అన్నాడాయన నవ్వుతూ. కొత్తేమున్నదీ అన్నట్టున్నదా నవ్వు. రంభా వూర్వశీ నవ్వుతూ అన్నారు. ఈ చేప కోసమే వెతుకుతున్నాం సాబ్. కొత్త చేపను పట్టాడని తెలిసింది. చేప స్వభావం చేపకి తెలుస్తుంది సాబ్. తప్పించుకున్నది'' అని నవ్వారు.

## 4

భైరవీ ఆలయము. మానసిక ఆరోగ్యమిచ్చు ఆలయము. వికలమగుట, ఫ్రీజ్ అగుట, పరిపరివిధాల ఆలోచనలు వచ్చుట, చాల గొప్ప వ్యక్తిననుకొనుట, చిన్న చిన్న చోరీలు చేసి, యెరగనట్టు చూచుట, నేర్పుగా తానే చేసిన తప్పిదమితరుల పై రుద్దుట, పసిపాపలాగా చూచుట, తనకు పదో యేడు అనుకొనుట వంటి పలురకముల చిత్తవృత్తులు కుదర్చబడును.

అధికారి విఘ్నదిగంబర్. అన్నివేళలలోనూ సంప్రదింప వీలున్నది. ఫోన్ నంబర్ తొమ్మిది. ఫాక్సు, ఇమెయిల్ పంపవచ్చు. కంప్యూటర్ సౌకర్యమున్నది.

స్పెషల్ రూమ్‌లో వున్న మానవుని స్వంత మనుషులు తీసికెళ్లానికి వచ్చారు. అధికారి విడుదల పత్రమిచ్చాడు. నడిపించుకుంటూ తీసికెళ్లి కారులో కూచోబెట్టి తోలుకెళ్లారు. చూసినవే చూస్తున్నట్టున్నది మానవునికి.

❋❋❋❋